General News




# పట్టభద్రుల ఉప ఎన్నిక ప్రశాంతం

**– ఎండను సైతం లెక్క చేయకుండా ఓటేసిన గ్రాడ్యుయేట్లు**

**– పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్**



**జనగామ, మన చౌరాస్తా :** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మూడు ఉమ్మడి జిల్లాల్లో 4,63,839 మంది ఓటర్లకు గానూ పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 3,35,680 మంది పట్ట భద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.

## వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణ

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్ లో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల పోలింగ్ సరళిని అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బాక్సుల తరలింపు పూర్తి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బాక్సుల తరలింపు ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. సోమవారం ఉప ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బాక్సులను జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయం నుంచి నల్గొండ జిల్లా కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్ కు తరలింపు ప్రక్రియను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన (27) పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పోలైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ అకౌంట్ ఫారం 16, పేపర్ సీల్ అకౌంట్, పీఓ డైరీ, పీఓ డిక్లరేషన్, జంబో బ్యాలెట్ బాక్సుల తాళాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా యంత్రాలను తరలించామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా పోలింగ్ ప్రక్రియ ముగిసిందని, ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించడంలో సహకరించిన ఓటర్లకు, భాగస్వాములైన అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమాచారం ఎప్పటికప్పుడు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, జనగామ తహసీల్దార్ వెంకన్న, సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఓటేసిన ప్రముఖులు















